

మాట్లాడుతున్న సీసీఎంబీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మోహన్‌రావు

సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలి

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): జీవశాస్త్రం, వైద్య రంగంలో కృత్రిమ మేధస్సు, ప్రాముఖ్యత ఎంతో పెరిగిందని సీసీఎంబీ మాజీ డైరెక్టర్, బిట్స్ పిలాని ప్రొఫెసర్ మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి డిగ్రీ, పీజీ, ఫార్మసీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో బయో అధ్యయన్ 2కే 24 పేరుతో సదస్సు జరిగింది.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో రోజురోజుకు జీవశాస్త్రం, వైద్యరంగంలో అనేక మార్పులు వస్తున్నాయని, ఈ రెండు రంగాలలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా నేడు డిగ్రీ, పీజీ, ఫార్మసీ చదివే విద్యార్థులు కూడా అందుకు అనుగుణంగా మారాలని సూచించారు. సాంకేతికతను ప్రతి విద్యార్థి అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. సదస్సులో లీడ్స్ ఫార్మా చైర్మన్, ఎండీ ప్రభాశంకర్, శ్రీనివాస లేబొరేటరీ డైరెక్టర్ డాక్టర్ వీరారెడ్డి, గాంధీ మెడికల్ కళాశాల పరిశోధన శాస్త్రవేత్త రాజేందర్, ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ ఎస్.వై.హెచ్. ఖాద్రీ, సీసీఎంబీ ఏఐసీ డాక్టర్ రాంజీ పల్లెల, అవంతి గ్రూఫ్ ఆఫ్ ఎడ్యుకేషన్ హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, అవంతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు స్ఫూర్తి జీవీ సుబ్రహ్మణ్యం

చిక్కడపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్-1 చైర్మన్ జీవీ సుబ్రహ్మణ్యం సేవలు విలువైనవని, ఆయన ఎందరో ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తారని లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. రఘుమారెడ్డి అన్నారు. సుబ్రహ్మణ్యం పదవీ విరమణ సందర్భంగా గురువారం సాయంత్రం బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ కోర్ట్ సభ్యులు ఆయనను కార్మిక కమిషనరేట్‌లో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఎం. మధుసూదన్, ఉపాధ్యక్షులు వై రంజిత్‌రెడ్డి, వి. తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యంను సన్మానించిన రఘురామ్‌రెడ్డి తదితరులు

కేంద్రంలో ఏర్పడబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఏర్పడబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో గురువారం ఆయన పాదయాత్ర చేశారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అమలు చేస్తున్న, చేయబోయే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నుంచి గతంలో గెలిచిన కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నప్పటికీ ఇక్కడి ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. బడుగు, బలహీనవర్గాలకు న్యాయం చేసే సత్తా కేవలం కాంగ్రెస్‌కు మాత్రమే ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మెజారిటీ హామీలను నాలుగు నెలల్లోనే నెరవేర్చారని వివరించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రంలో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం హస్తం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని దానం నాగేందర్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు మామిడి నర్సింగరావు, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

పద్మశాలీల అభివృద్ధికి కృషి

రాంనగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకర్గం నుంచి ఎంపీగా తనను గెలిపిస్తే పద్మశాలీల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు అతినగరం సుదేష్, పద్మశాలి సంఘం నాయకులు, బీఆర్ఎస్ నేతలు దానం నాగేందర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్‌యాదవ్ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి దానం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గంలో 30 వేల పై చిలుకు పద్మశాలి ఓటర్లు ఉన్నారని, వారందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం పద్మశాలీలకు అండగా ఉంటుందన్నారు. సుధేష్ మాట్లాడుతూ.. దానం నాగేందర్ గెలుపునకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో పద్మశాలీ సంఘం, బీఆర్ఎస్ నాయకులు కందగట్ల వెంకటేష్, కోడి వెంకటేష్, చిప్ప జగదీష్, సిలివేరు నారాయణ మూర్తి, ఎ. సాయిరాం, అన్నల్‌దేశ్ రాజేష్, జె.బాలరాంరాజ్, కావాలి మధుకర్, ప్రవీణ్‌కుమార్, నగేష్, సన్ని ఉన్నారు.

వడ్డెర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

చిక్కడపల్లి: వడ్డెర కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. గురువారం ఆయన సమక్షంలో వడ్డెర సంఘం నేతలు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి దానం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వడ్డెర ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్టు చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య, డైరెక్టర్ డా. ఓర్సు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో గెలుస్తాం

హిమాయత్‌నగర్: సికింద్రాబాద్‌లో గెలుస్తామని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. హిమాయత్‌నగర్‌లో ఏర్పాటుచేసిన ఎన్నికల క్యాంపు కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌లో ఏడేళ్లపాటు నిర్బంధంలో గడిపినట్లుగా ఉండేదని, కాంగ్రెస్‌లోకి వచ్చిన తర్వాత స్వాతంత్ర్యం వచ్చినట్లుగా ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలందరూ సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. టీపీసీసీ నేతలు అంజన్ కుమార్, నిరంజన్, రోహిణ్, రామన్‌గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్ మహాలక్ష్మి పాల్గొన్నారు.


దానం, అంజన్‌కుమార్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పద్మాశాలి సంఘం అధ్యక్షుడు సుధేష్ తదితరులు


జూబ్లీహిల్స్ ఇందిరానగర్‌లో మాట్లాడుతున్న దానం నాగేందర్

పలు ప్రాంతాల్లో నాయకుల ప్రచారం

ముషీరాబాద్/రాంనగర్/కవాడిగూడ/చిక్కడపల్లి: దానం నాగేందర్‌కు మద్దతుగా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ జాతీయ కార్యదర్శి బిజ్జి శత్రు ఆధ్వర్యంలో ముషీరాబాద్ డివిజన్‌లో గురువారం ప్రచారం నిర్వహించారు. బాగ్అంబర్‌పేటలో కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు పోతరాజు బాస్కర్ ఆధ్వర్యంలో దోమలగూడలోని మునిసిపల్ క్వార్టర్స్, గగన్‌మహల్, జ్యోతినగర్, దేవి ప్రసాద్,కూచిపూడి తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరుతూ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. రోహిత్ ఆధ్వర్యంలో గురువారం విద్యానగర్‌లో గాడిద గుడ్డు ఏర్పాటు చేసి బీజేపీ పాలనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. కిషన్‌రెడ్డి అంబర్‌పేట అభివృద్ధికి కృషి చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపిస్తే సికింద్రాబాద్ అభివృద్ధి చెందుతుందన్నారు.


అమ్మవారి ఆలయానికి గ్రానైట్ రాయి అందజేస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

అమ్మవారి ఆలయ పునర్‌నిర్మాణానికి కార్పొరేటర్ చేయూత

చిక్కడపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ సబర్మతినగర్‌లోగల నల్లపోచమ్మ దేవాలయం పునర్‌నిర్మాణానికి కార్పొరేటర్ పావని చేయూతనందించారు. గర్భగుడితోపాటు ఆలయ మొత్తానికి గ్రానైట్ స్టోన్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయ పునర్‌నిర్మాణంలో తమవంతు సహాయంగా ఫ్లోరింగ్ కోసం గ్రానైట్ స్టోన్ అందజేసి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఫ్లోరింగ్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ బీజేపీ నాయకులు ఎం. ఉమేష్, అశోక్‌యాదవ్, నర్సింగ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల రద్దు ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలి

బర్కత్‌పుర, మే 2 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లను రద్దు చేసే ప్రయత్నాన్ని బీజేపీ ఉపసంహరించుకోవాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎ. రాజేశ్వర్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు వస్తున్న సందర్భంగా బీసీల కులగణన, ప్రత్యేక మంత్రిత్వశాఖ, బీసీ బిల్లుపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలనలో బీసీలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని, బీసీ కులగణన చేయకుండా అణచివేసే ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీసీలంతా ఒకేతాటిపై నిలిచి బీజేపీని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు భిక్షపతి, మల్లేష్, మహేందర్‌గౌడ్, సాయి, రాహుల్, లక్ష్మణ్, మధు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజేశ్వర్‌యాదవ్

బీజేపీ మీడియా సెల్ ఇన్‌చార్జిగా బిజ్జి కనకేష్‌కుమార్

ముషీరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం మీడియా సెల్ ఇన్‌చార్జిగా భోలక్‌పూర్ డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకుడు బిజ్జి కనకేష్ కుమార్ నియమితులయ్యారు. ఆయనకు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, రాష్ట్ర నాయకుడు చర్ల గోపాల్‌రెడ్డి గురువారం నియామకపత్రం అందజేశారు. కనకేష్‌కుమార్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డి గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు.



5న మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం

బర్కత్‌పుర, మే 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ఈనెల 5న కాచిగూడ మున్నూరు కాపు భవన్‌లో మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శి మంగళారపు లక్ష్మణ్ తెలిపారు. గురువారం కాచిగూడలో మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మున్నూరు కాపులు దానం నాగేందర్ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో లింగిశెట్టి హనుమంతరావు, కొండూరు వినోద్‌కుమార్, బి.ఆర్. జితేందర్, కట్టెల సుభాష్, ఆనంద్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో తెలంగాణ ఉద్యమకారుడి మృతి

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుడు గురుచరణ్‌సింగ్(68) గుండెపోటుతో గురువారం ఉదయం రాంనగర్‌లో తన నివాసంలో మృతి చెందారు. ఆయన సతీమణి కొంత కాలం క్రితం చనిపోయారు. ఆయనకు కుమారుడు ఉన్నారు. నాయిని నర్సింహారెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉండి తెలంగాణ ఉద్యమంలో పనిచేశారు. జనతాదళ్ పార్టీలో కూడా నాయినితో గురుచరణ్‌సింగ్ పనిచేశారు. మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొని జైలుకు వెళ్లారు. కొద్ది కాలం క్రితం అనారోగ్యానికి గురయ్యారు.


గురుచరణ్ సింగ్ (ఫైల్)

ఆయన మరణవార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, తెలంగాణ జన సమితి గ్రేటర్ అధ్యక్షుడు ఎం. నర్సయ్య, ముషీరాబాద్ జేఏసీ కన్వీనర్ బి. శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు గురుచరణ్‌సింగ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎంపీగా గెలిపించండి.. అందుబాటులో ఉంటా

బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఎంపీగా గెలిస్తే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ తెలిపారు. గురువారం అడిక్‌మెట్ డివిజన్‌లో ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. జనం మనిషిగా పేరొందిన పద్మారావుగౌడ్ ఎంపీగా గెలిస్తే పార్లమెంట్‌లో తమ సమస్యలపై పోరాడతారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ముఠా జైసింహ, శ్యాంసుందర్, నేత శ్రీనివాస్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా గెలిచి చరిత్ర సృష్టిస్తా

చిక్కడపల్లి: సికింద్రాబాద్ ఎంపీగా గెలిచి చరిత్ర సృష్టిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ అన్నారు. అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందని, వారందరి సహకారంతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. గురువారం గాంధీనగర్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. అధికారంలో ఏ పార్టీ ఉంటే అందులోకి వెళ్లడం దానం నాగేందర్‌కు అలవాటుగా మారిందన్నారు.


అడిక్‌మెట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న పద్మారావు, ముఠాగోపాల్

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ముషీరాబాద్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం భారత్ సేవా సమాజ్, శివాలయం చౌరస్తా, భరత్‌నగర్‌లో పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పద్మారావుగౌడ్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

పద్మారావు గెలిస్తే సికింద్రాబాద్ అభివృద్ధి

బర్కత్‌పుర: పద్మారావును గెలిపిస్తే సికింద్రాబాద్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం కాచిగూడ ఏకే భవన్‌లో కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు ఎత్తివేస్తామంటున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని విముక్త చిరుతల పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తోల్ తిరుమావళవన్ పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీ ఇండియా కూటమిలో ఉంటూ తమిళనాడులో పోటీ చేస్తుందన్నారు. ఏపీలో కాంగ్రెస్ నేతలు తమతో పొత్తుకు రాకపోవడంతో సికింద్రాబాద్‌తోపాటు ఏడు ఎంపీ నియోజకవర్గాలలో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, వారిని గెలిపించాలని ప్రజలను కోరారు. జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీజేపీ మతోన్మాద శక్తులను ఓడించడమే తమ పార్టీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ దేవేందర్, మంచికంటి ఆంజనేయులు, తెలంగాణ శ్యామ్, దారబోయిన రవి, వెంకటేష్, ఆ పార్టీ ఎంపీ అభ్యర్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విముక్త చిరుతల పార్టీ జాతీయ అధ్యక్షుడు తోల్ తిరుమావళవన్

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి మహిళ మృతి

జీడిమెట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి ఓ మహిళ మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. జగద్గిరిగుట్ట, అంజయ్యనగర్‌కు చెందిన యాదవ్‌రెడ్డి భార్య ఎ.పుష్పలత (29), గత నెల 30న కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో చేరింది. ఆపరేషన్ పూర్తయిన తర్వాత గురువారం స్పృహ తప్పింది. వెంటనే ఆల్విన్‌కాలనీలో మరో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంప్రదాయాలను ముందుతరాలకు అందించడం అభినందనీయం


జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో చిన్నారులు

చిక్కడపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలను ముందుతరాలకు అందించడం అభినందనీయమని ప్రముఖ నృత్య కళాకారిణి సరళకుమారి అన్నారు. సాలభంజిక స్టూడియో ఫర్ ఆర్ట్స్ అండ్ పర్ఫార్మెన్స్ సంస్థ 6వ వార్షికోత్సవం గురువారం త్యాగరాయగాన సభలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. సాలభంజిక సంస్థ ఎందరో కళాకారులను తీర్చిదిద్దిందన్నారు. ఒక సంస్థను ఓ మహిళ ఆరేళ్లపాటు నడపడం అంత సులువు కాదన్నారు. కేరళ రాష్ట్రంలోనే కాకుండా హైదరాబాద్‌లో కూడా సాలభంజిక సంస్థ శాఖలను స్థాపించి నడపడాన్ని అభినందించారు. ఈ సందర్భంగా నాట్య గురువులు గంటా పద్మజ, లంకేశ్, కోన జానకి, మోహన్‌రావు, బద్దర్‌రావు, డా. అరవ ఆంజనేయులు, అద్దాల నాగేశ్వరరావును సన్మానించారు. ప్రముఖ నటి రాగిణి, గంధం బసవ శంకరరావు, పాలపర్తి సంధ్యారాణి, దైవజ్ఞశర్మ, సాలభంజిక వ్యవస్థాపకురాలు డా. పట్టాభి ధన్య మీనన్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు. శివ పంచాక్షరి, దశావతారాలు, మండూక శబ్దం, అన్నమాచార్య కీర్తనలు, తరంగం, థిల్లానా నృత్యాలను చిన్నారులు అద్భుతంగా ప్రదర్శించారు. చిన్నారులకు అతిథులు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.


మాట్లాడుతున్న డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు

సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి గెలుపు ఖాయం

బర్కత్‌పుర, మే 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజయం ఖాయమని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. గురువారం కాచిగూడ డివిజన్ లింగంపల్లి వద్ద నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షపార్టీల నేతలు కొందరు బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారని, దీనిని ఎస్సీ, ఎస్టీ, బీసీలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ నాయకులు కన్నె రమేష్‌యాదవ్, ఎ. సూర్యప్రకాష్‌సింగ్, కృష్ణకుమార్, సుభాష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఇంటింటి ప్రచారం

రాంనగర్: బీజేపీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్, ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్ ఆధ్వర్యంలో హరినగర్, శాస్త్రినగర్, ఎస్ఆర్‌టీ కాలనీలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీకి ఓటు వేసి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

కవాడిగూడ: సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డి గెలుపొందడం ఖాయమని ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, ఎస్సీ మోర్చా నగర అధికార ప్రతినిధి మీసాల విఠల్‌రావు అన్నారు. గురువారం కవాడిగూడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

'హరేకృష్ణ మూవ్‌మెంట్'కు డీజిల్ జనరేటర్ అందజేత

హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు రూ. 54 లక్ష విలువైన 625 కేవీఏ జనరేటర్‌ను బీఎస్‌సీపీఎల్ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య అందజేశారు. అన్నపూర్ణ, భోజనామృత, సద్దిమూట వంటి పథకాలతో నిరుపేదల ఆకలి తీర్చే కార్యక్రమాలను సమర్థవంతగా అమలు చేసేందుకు వంటగది సామర్థ్యాలు పెంచేందుకు ఫౌండేషన్ ప్రయత్నాలు చేస్తోంది. ఈ సందర్భంగా బీఎస్‌సీపీఎల్ కంపెనీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య మాట్లాడుతూ.. హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ మానవాళికి చేసే సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమన్నారు. హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్యగౌరచంద్ర దాస ప్రభుజీ మాట్లాడుతూ.. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సమాజంలో సానుకూల మార్పును పెంపొందించడంలో బీఎస్‌సీపీఎల్ నిబద్ధతకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ సెక్రటరీ రాఘవ, హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ ప్రముఖులు పాల్గొన్నారు.


హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్‌కు డీజిల్ జనరేటర్ అందజేసిన బీఎస్‌సీపీఎల్ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య

పోగొట్టుకున్న గొలుసు బాధితురాలికి అందజేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): రైలులో పోగొట్టుకున్న బంగారు గొలుసును ఆర్పీఎఫ్ పోలీసులు బాధితురాలికి అప్పగించారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రయాణికురాలు గురువారం కోకనాడ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తోంది. లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో రైలు దిగిన తర్వాత మెడలో ఉన్న 13 గ్రాముల బంగారు గొలుసు కనిపించకపోవడంతో ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు వెంటనే ఆమె ప్రయాణించిన బోగీలో వెతకగా బెర్తు కింద గొలుసు లభించింది. బాధితురాలికి అందజేశారు.

మేనకోడలిని ఫోన్‌లో వేధిస్తున్న వ్యక్తికి జైలు

బంజారాహిల్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): మేనకోడలిని ఫోన్‌లో వేధిస్తున్న వ్యక్తికి కోర్టు ఎనిమిది రోజుల జైలు శిక్ష విధించింది. నగరానికి చెందిన శ్రీను ప్రైవేటు ఉద్యోగి. అతడి మేనకోడలు భర్తతో గొడవపడి ఒంటరిగా ఉంటోంది. శ్రీను తరచూ ఆమెకు ఫోన్ చేసి వేధిస్తున్నాడు. ఆమె ఫోన్ నంబర్‌ను తెలిసిన వారికి కూడా ఇచ్చాడు. బాధితురాలి ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి ఈ-పెట్టీ కేసు పెట్టి 10వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. నిందితుడికి 8 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి మందా మురళీ తీర్పు చెప్పారు.

హోటల్ వ్యాపారికి నాలుగు రోజులు..

అర్ధరాత్రి దాటినా హోటల్ తెరిచి వ్యాపారం నిర్వహిస్తున్న యజమానికి న్యాయస్థానం నాలుగు రోజుల జైలు శిక్ష విధించింది. ఇందిరానగర్‌లో షబ్బీర్ ఖాజీమ్ రజ్వీ స్పైసీ పేరిట హోటల్ నిర్వహిస్తున్నాడు. నిబంధనలను ఉల్లంఘిస్తూ అర్ధరాత్రి తరువాత కూడా హోటల్ తెరిచి ఉంచుతున్నాడు. పోలీసులు హెచ్చరించినా పట్టించుకోలేదు. దీంతో ఖాజీమ్ రజ్వీపై 70(సి) కింద ఈ-పెట్టీ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. నిందితుడికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి మందా మురళీ తీర్పు చెప్పారు.

హోటల్ బిల్లులు వాడుకున్న ఉద్యోగిపై క్రిమినల్ కేసు

హోటల్ బిల్లులను సొంత బ్యాంకు ఖాతాలోకి మళ్లించుకొని యజమానిని మోసం చేసిన ఉద్యోగిపై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 63లో గల హోటల్ ట్రీఇన్నత్‌కు వల్లభనేని కృష్ణ మోహన్‌బాబు మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం 2023-2024 ఆడిట్ నిర్వహించగా అందులో రూ. 6 లక్షలు లెక్కకు రాలేదు. రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న దండు సుధాకర్ వినియోగదారుల నుంచి వచ్చిన డబ్బును తన బ్యాంకు ఖాతాలోకి మళ్లించి సొంత అవసరాలకు వాడుకున్నట్టు గుర్తించారు. అతడిని నిలదీయగా డబ్బు వాడుకున్నట్లు అంగీకరించాడు. తిరిగి ఇచ్చేస్తానని చెప్పడంతో ఉద్యోగంలో కొనసాగించారు. ఇటీవల మరో వినియోగదారుడికి బాంకెట్‌హాల్‌తో పాటు 20 గదులు అద్దెకు ఇస్తానని చెప్పి తన ఖాతాలో మూడు లక్షల రూపాయలు జమ చేయించుకున్నాడు. హోటల్ మేనేజింగ్ డైరెక్టర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి ఆత్మహత్య

ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది కేరళకు చెందిన యాసిర్‌సిద్దిఖీ, తస్‌ఫియా అలవి(23) భార్యాభర్తలు. కొద్ది రోజుల క్రితం నగరానికి వచ్చి టోలీచౌకి సమతా కాలనీలో ఓ భవనంలో పెంట్‌హౌస్‌లో ఉంటున్నారు. ఈ నెల 1న యాసిర్‌సిద్దిఖీ పనిమీద బయటకు వెళ్లాడు. రాత్రి తిరిగి వచ్చేసరికి తలుపులు వేసి లోపల గడియపెట్టి ఉంది. పిలిచినా తలుపులు తీయకపోవడంతో అనుమానంతో కిటికీలో నుంచి చూడగా తస్‌ఫియా బెడ్‌రూంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని వేలాడుతూ ఉంది. తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే ఆమె మృతిచెందింది. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దృష్టి మరల్చి సెల్‌ఫోన్‌తో పారిపోయిన వ్యక్తి అరెస్ట్

ఖైరతాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): దృష్టి మరల్చి సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోయిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఖైరతాబాద్ డీఎస్ఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలబస్తీకి చెందిన రవికుమార్ ప్రైవేటు ఉద్యోగి. మార్చి 14న ఖైరతాబాద్ మెట్రో రైల్వేస్టేషన్ వద్ద కంపెనీ బస్సు దిగి ఇంటికి వెళ్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తి వచ్చి అర్జెంటుగా ఫోన్ మాట్లాడాలని రవికుమార్ సెల్‌ఫోన్ తీసుకుని కనిపించకుండా పోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫోన్ ఐఎంఈఐ నంబరు ఆధారంగా నిందితుడిని గురువారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.